www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 మార్చి 2024
5
చిత్తూరు



కట్టుదిట్టంగా 'మోడల్ కోడ్' అమలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తప్పనిసరిగా మోడల్ కోడ్ అమలు అయ్యేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి శనివారం ఎంపీడీవోలు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలు సమయంలో ప్రైవేట్ ఆస్తులలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న చిన్నచిన్న ప్రచార సామాగ్రికి అనుమతి ఉంటుందని, అయితే శాశ్వతంగా ఏర్పాటు చేసుకున్న ప్రచార సామాగ్రికి అనుమతి వుండదని కోడ్ అమలు చేయాలని అన్నారు. మోడల్ కోడ్ అమలులో ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అయితే ప్రభుత్వ స్థలాలలో ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన ప్రదేశాలలో పెట్టడానికి వీలులేదని ఈ విషయంలో మోడల్ కోడ్ అమలు చేయాలని ఆదేశించారు.

మహిళా ఓటర్లే 'కీ'లకం

- తీర్పులో.. నారీమణులు
- నియోజకవర్గంలో మహిళలే అధికం
- ఓటర్లను మెప్పించడానికి నాయకుల పాట్లు


మహిళా ఓటర్లను మెప్పించడం ఎలా..? మహిళా ఓట్లు గంపగుత్తగా పడటానికి ఉన్న మార్గాలు ఏమిటి..? ఇందుకు తీసుకోవాల్సిన ప్రణాళికలు ఏవీ..? ఏ వర్గం మహిళలను ఏవిధంగా ఒప్పించాలని నాయకులు మల్లగుల్లాలు పడుతున్న నియోజకవర్గమే పూతలపట్టు నియోజకవర్గం. పురుషులకన్నా మహిళా ఓటర్లు అధికంగా ఉండటమే ఇందుకు కారణం.

ప్రజాశక్తి- పూతలపట్టు

అక్కడ మహిళా ఓటర్లే న్యాయనిర్ణేతలు.... నాయకుల భవిష్యత్తును నిర్ణయించేది వారే.. ఎన్నికల్లో మహిళల ఓట్లే శాసనం.. మహిళలు ఎవరి వైపు నిలబడితే వారిదే విజయం. మహిళా ఓటర్లకు ఇంతటి ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గం ఏదని అనుకుంటున్నారా..? ఇదే పూతలపట్టు ఎస్సీ నియోజకవర్గం.

ఈ నియోజకవర్గంలో యాదమరి, తవణంపల్లె, బంగారుపాళ్యం, ఐరాల, పూతలపట్టు ఐదు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పూతలపట్టు నియోజకవర్గం నూతనంగా ఏర్పడింది. విభజన అనంతరం జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒకసారి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా మిగిలిన రెండు సార్లు వైసీపీ విజయం సాధించింది. నియోజకవర్గం ఏర్పడిన నాటినుంచి మహిళా ఓటర్లే కీలకంగా మారుతున్నారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రవి 850 ఓట్లు, 2014లో వైసీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ 903 స్వల్ప మెజారిటీతో బయటపడ్డారు. 2019 ఎన్నికల్లో మాత్రం వైసీపీ అభ్యర్థి ఎంఎస్ బాబు 30వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందారు.

మండలం	పోలింగ్ కేం..	పురుషులు	మహిళలు
పూతలపట్టు	43	20155	20673
ఐరాల	42	18313	18909
తవణం పల్లె	56	20942	21817
బంగారు పాళ్యం	68	28952	30091
యాదమరి	52	19979	20056
మొత్తం	260	108341	111546



3,205 మంది మహిళా ఓటర్లు

పూతలపట్టు నియోజకవర్గంలో ఇప్పటివరకు అధికారులు అందించిన సమాచారం మేరకు పురుషులకంటే మహిళా ఓటర్లు 3,205 మంది అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 1,08,341 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 1,11,546 మంది ఉన్నారు. ఈ కారణంగానే మహిళా ఓటర్ల ప్రాధాన్యత ఈ నియోజకవర్గంలో సంతరించుకుంది. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతానికి మొత్తం 260 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఐరాల మండలంలో ఈ మారు అధనంగా మరో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ఎన్నికల సంఘానికి నివేధికలు పంపారు. అదేవిధంగా సమస్యాత్మకంగా ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం నియోజకవర్గంలో 23 పోలింగ్ కేంద్రాలను మార్చినట్టు సమాచారం.

దళితుని శవం 'డోర్ డెలివరీ'

పోలీసు స్టేషన్ ఎదుట బంధువుల ధర్నా
గ్రానైట్ యజమాని సహా మరొకరిపై కేసు నమోదు



సుధాకర్‌ను హత్య చేసినవారిపై కేసునమోదు చేయాలంటూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు, స్నేహితులు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: అనుమానాస్పద స్థితిలో దళితుడు సుధాకర్ (51) మృతిచెందిన ఘటన శుక్రవారం జీడీనెల్లూరు మండలం పాచిగుంట దళితవాడలో చోటుచేసుకుంది. ఆరోగ్యంగా ఉన్న సుధాకర్ శవమై ఇంటికి రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రానైట్ ఫ్యాక్టరీ వారే హత్య చేశారంటూ బంధువులు చిత్తూరు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. కుటుంబీకుల వివరాల మేరకు... జీడీనెల్లూరు మండలం పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ చిత్తూరు పారిశ్రామికవాడలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం స్నేహితునితో కలిసి సుధాకర్ వెళ్లాడు. కొద్దిసేపటికే ఆటోను మృతుని ఇంటి వద్ద ఆపి సుధాకర్ మృతదేహాన్ని ఇంటిముందు దింపి స్నేహితుడు పరారయ్యారు. ఆరోగ్యంగా ఉన్న సుధాకర్ మృతిచెందడం, వెళ్లిన గంటకే శవమై రావడం పట్ల అతని బంధువులు, స్నేహితులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో శవ పంచనామా నిర్వహించారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న సుధాకర్ బంధువులు, స్నేహితులు సుధాకర్‌ను గ్రానైట్ యజమాని సహకారంతోనే హత్య చేశారంటూ నిరసన తెలిపారు. గ్రానైట్ యజమానిని, ఆటోలో శవాన్ని తీసుకొచ్చిన స్నేహితుడిపై కేసు నమోదు చేయాలంటూ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. చిత్తూరు వన్‌టౌన్ సిఐ విశ్వనాథరెడ్డి ఆందోళనకారులకు సర్దిచెప్పి కేసు నమోదు చేస్తామంటూ హామీ ఇచ్చారు. గ్రానైట్ యజమానిని, సుధాకర్ మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన ఆటో డ్రైవర్‌ను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గ్రానైట్ యజమాని నాగరాజు, ఆటో డ్రైవర్ రఘుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పోస్టుమార్టం అనంతరం అతను అతిగా మద్యం తాగి మరణించాడని, పోలీసులు కేసు ఫైల్ చేశారు.



మృతుడు సుధాకర్ (ఫైల్‌ఫోటో)

సమగ్ర విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

గంగాధర నెల్లూరు మండలంలోని పాచిగుంటట దళిత డ్రైవర్ సుధాకర్‌ను చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద బాధితులను పరామర్శించినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఆటోలో ఇంటికి డెలివరీ చేయడం దారుణమని ఈ ఘటనపై పోలీసులు నిస్పచ్ఛపాతంగా విచారణ చేపట్టి సుధాకర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జిల్లాలో ఇప్పటికైనా దళితులపై జరుగుతున్న దారుణాలను అరికట్టే విధంగా పోలీసులు, జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

తండ్రి మరణ వార్త తెలిసినా పది పరీక్ష రాసిన కొడుకు

గంగాధర నెల్లూరు: తండ్రి మరణించాడని తెలిసినా 10వ తరగతి పరీక్షలు రాశాడు ఓ విద్యార్థి. మండలంలోని పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఇతనికి ముగ్గురు కుమారులు. పెద్ద కొడుకు ఉపేంద్ర డిగ్రీ చదువుతున్నాడు, రెండో కొడుకు సంజయ్ ఇంటర్, మూడో కొడుకు బాబి పదవ తరగతి చదువుతున్నారు. తండ్రి మృతిపై అనుమానాలు, ఆందోళనల నడుమ సుధాకర్ చిన్న కొడుకు బాబి పదవ తరగతి పరీక్షలు రాశాడు. ఇతను రామకుప్పం గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. తండ్రి మరణవార్త తెలిసి ఆ పసిహృదయం ఎంత గాయపడి ఉంటుందో బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

కళ తప్పిన జలకళ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రైతులకు తోడ్పాటును అందించేలా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన వైఎస్ఆర్ జలకళ కళతప్పుతోంది.... పాదయాత్ర సందర్భంగా రైతు కష్టాలను గుర్తించిన నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి పేద, సన్నకారు రైతులకు ఉచితంగా బోరువేసి సాగునీటి సౌకర్యం కల్పించేలా వైఎస్ఆర్ జలకళ పథకాన్ని రూపొందించారు. చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాల్లో పాడి రైతులు తమ పొలాల్లో నీటిని పారించాలనే ఆశతో బోర్లు వేసి అప్పులపాలైయ్యారు. ప్రభుత్వం వైఎస్ఆర్ జలకళ పథకం ఆదుకుంటుందని జిల్లాలోని రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్దేశ్యం మంచిదైనప్పటికీ నిధులు, జీయాజిస్టుల కొరత, బోర్ల డ్రిలింగ్ ఆలస్యంతో ఈ పథకం కళ తప్పుతోంది.

వ్యవసాయ పొలంలో ఎలాంటి బోరు సౌకర్యం లేని రైతులు అర్హులు, గతంలో బోరు వేసినా వినియోగంలో లేకుంటే అర్హులు ముఖ్యంగా మహిళా రైతులకు మొదటి ప్రాధాన్యత. అర్హతలు ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకాలను వారి పరిధిలోని గ్రామ సచివాలయంలోనైనా లేదా ఆన్‌లౌన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి డ్వామా ద్వారా బోరు డ్రిల్లింగ్ మంజురు చేయడం జరుగుతుంది. బోరు మంజురైన్నట్లైతే డ్వామా ద్వారా గ్రామ సచివాలయానికి బోరు మంజురైన రైతుల వివరాలను ఆయా సచివాయాలకు పంపాల్సి ఉటుంది. బోరు మంజురైన రైతులకు జియోట్యాగింగ్ చేసి బోరు తవ్వకం ప్రారంభిస్తారు. ముందుగా జియాలజిస్టులు బోరు వేసే పాయింట్‌ను గుర్తిస్తారు. భూగర్భ జలమట్టం, నీరు పడుతుందో లేదో గుర్తిస్తారు.



నిధులు, జియాలసిస్టుల కొరత..

రాష్ట్ర ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 28వ తేదీ పేద, సన్న కారు రైతులకు ఉచితంగా బోర్లు వేసేలా ఈ పథకాన్ని తీసుకొచ్చింది. పేద, సన్న కారు రైతులను దృష్టిలో ఉచిత బోరుతో పాటు బేసింగ్ పైపు, బోరు మోటరు, విద్యుత్ కన్షెన్ ఉచితంగా ఇచ్చేలా మార్పులు చేశారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలకు నియోజకవర్గానికి ఒక్క బోరు అంటే 14 బోర్లు ప్రభుత్వం మంజురు చేసింది. జిల్లాలో ఎక్కడైనా బోరు బండి మరమ్మతుకు గురైతే ఉపయోగించుకొనేలా అదనంగా మరో బోరు బండి అంటే 15 బోరు బండ్లు జిల్లాకు మంజురు చేశారు. ఆదిలో జిల్లాలోని రైతులు ఉచిత బోర్లపై ఆసక్తి చూపి దరఖాస్తులు చేసుకున్నారు. జియాలజిస్టుల కోతర, నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఈ పథకం నీరుగారిపోయిందనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ఈ బోరు బండ్లు డ్వామా (గ్రామీణ నీటి సరఫరా విభాగం) ఆధీనంలో ఉన్నాయా.... లేక అధికార పార్టీ నేతల వద్ద ఉన్నాయా అనే అనుమాలు ఉన్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజురు చేసిన బోర్లు ఏక్కడున్నాయనే విషయాన్ని జిల్లా అధికారులు తేల్చాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. పేద, సన్నకారు రైతాంగాన్ని ఆదుకొనేలా ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్ఆర్ జలకళ కలతప్పకుండా రైతాంగానికి ఉపయోడపడేలా చూడాలని జిల్లాలోని రైతాంగం కోరుతోంది.

25, 26 తేదీల్లో

కుప్పంలో చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 25,26 తేదీల్లో రెండు రోజులపాటు రాష్ట్ర ప్రతిపక్షనేత తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తన స్వంత నియోజవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు. 25వ తేదీ మధ్యహ్నం 3.20 గంటలకు కుప్పం ఆర్‌టిసి బస్‌స్టాండ్ వద్ద నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. రామకుప్పం మండలం, రాజుపేట వద్ద హంద్రీ- నీవా కృష్ణా జలాల ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తారు. మొదటి రోజు ఉదయం 11.15 గంటలకు బెంగళూరు ఎయిర్పోర్ట్ నుంచి ఉదయం 11.25 గంటలకి పిఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రి హెలిఫ్యాడ్ ఆవరణంకి, 11.40 గంటలకు కొత్తపేట కుప్పం మున్సిపాలిటీకి చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం ఎన్టీఆర్ భవనానికి చేరుకుని 2గంటల వరకు స్థానిక కుప్పం టిడిపి నాయకులతో సమావేశం. 3.20 గంటలకు కుప్పం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఇఫ్తార్ విందుకు హాజరవుతారు. 7.30కి టీడీపీ కార్యాలయంలో స్థానిక టీడీపీ నేతలతో సమీక్ష సమావేశం. 8.45లకు టీడీపీ కార్యాలయం నుండి ఆర్ అండ్ బి అతిధి విశ్రాంతి గృహానికి చేరుకుంటారు. రెండవ రోజు ఉదయం 10.50 నుండి 11 గంటలకు ఆర్ అండ్ బి అతిధిగృహం నుండి కెవి.ర్ కళ్యాణ మండపం చేరుకుంటారు. 11 నుంచి 12.50 గంటలకి నారా చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ చేరికలు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాబు నగర్‌లో క్యాంపెనింగ్. 2.30 నుండి 3.30 గంటల వరకు టీడీపీ నాయకులతో సమీక్ష సమావేశం. 4.30 గంటలకి రాజుపేట గ్రామం, రామకుప్పం చేరుకుంటారు. 5.30లకు వరకు హంద్రీ-నీవా ప్రాజెక్టు పరిశీలన, సాయంత్రం 6 నుండి 7.45 గంటల వరకు టీడీపీ నాయకులతో సమీక్ష సమావేశం. 8గంటలకు అర్‌అండ్‌బి అతిధిగృహం చేరుకుంటారు. అక్కడి నుండి తిరుగు ప్రయాణం కానున్నారు.

చిత్తూరు పార్లమెంట్

టిడిపి అభ్యర్థిగా దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:



చిత్తూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థిగా దగ్గు మళ్ళ ప్రసాదరావును పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రకటించారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం చింతగుంపల్లెకి చెందిన దగ్గు మళ్ల ప్రసాదరావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసి ఐఆర్ఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. 2019లో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం రాదే కన్స్ట్రక్షన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో రాజకీయాల్లోకి రాణించాలన్న తన ఆకాంక్షను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు తెలపడంతో చిత్తూరు ఎస్సీ రిజర్వ్ అయిన పార్లమెంట్ టిడిపి అభ్యర్థిగా దగ్గు మళ్ళ ప్రసాదరావును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించాలంటే అందుకు రాజకీయం తోడు కావాలని భావించానని తెలిపారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంపై తనకు సంపూర్ణ అవగాహన ఉందని పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలు అభివృద్ధి చేస్తానని తెలిపారు.

'కోడ్' కొరఢా...!

స్వామిభక్తికి ...స్వస్తి చెప్పాల్సిందే..!

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- తిరుపతి సిటి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది...అధికారులు, ఉద్యోగులు అధికార పక్షానికి అండగా ఉంటే అంతేసంగతులు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా చర్యలు తప్పవు. ఇప్పటికే జిల్లాలో కోడ్ ఉల్లంఘన చర్యలు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల వాలంటీర్లు పట్టుబడుతున్నారు. గతంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ ఈ సారి పకడ్బంది చర్యలు చేపట్టడం గమనార్హం. 'సి విజిల్ యాప్' సైతం అందుబాటులోకి వచ్చింది.

అధికారంలో ఉన్న వాళ్ల పట్ల స్వామిభక్తి చూపిస్తే ఉద్యోగులకు పదోన్నతులు, అనుకున్న చోటికి బదిలీలు, ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణ చేయెచ్చు అని కొంతమంది అధికారులు, ఉద్యోగులు అధికార పక్షానికి తొత్తులుగా వ్యవహరించడం పరిపాటే. ఇదంతా సాధారణ రోజుల్లో.. ఎన్నికల సమయాల్లో స్వామిభక్తికి స్వస్తి చెప్పాల్సిందే. కాదు కూడదనుకుంటే కొరఢా ఝులిపిస్తుంది. చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో అనేక మంది అధికారులు, ఉద్యోగులు అధికార పక్షానికి తొత్తులుగా వ్యవహరిస్తూ, వారికి అనుకూలంగా నిర్ణయాలు చేసిన ఘటనలు అనేకం. రెవెన్యూ విభాగం మరో అడుగు ముందుకేసి అధికార పార్టీ భూకబ్జాలకు, ఇసుక దోపిడికి, మైనింగ్ మాఫియాగా సహకరించారన్నదీ బహిరంగ రహస్యమే. వామపక్షాలు, ప్రతిపక్షాలు ఎన్ని ఉద్యమాలు, నిరసనలు, నిరహారదీక్షలు చేసిన చెవిటోడి చెవిలో శంఖం ఊదినట్లే అనే రీతిలో వ్యవహరిస్తూ, అధికార పార్టీ అండతో పెట్రేగేపోయారు. మున్సిపల్, కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉపాధ్యాయ, పట్టాభద్ర ఎంఎల్‌సి ఎన్నికల్లో నకిలీ ఓట్లు నమోదు, దొంగోట్లు పోలింగ్‌కు సహకరించి, అధికార పార్టీ ఆధిక్యానికి తోడ్పాటు అందించారు. ఈ వ్యవహారాలపై ఈసికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కొంత మంది అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంది. అయితే ఆయా ప్రజాప్రతినిధులు మాత్రం వారికి అండగా ఉండలేకపోయారు. అవసరానికి వాడుకుని, వారిని బలి పశువులు చేశారన్నది సత్యం. ఇన్ని జరుగుతున్నా కొంతమందిలో మార్పే లేదు.

ఈ నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా సాధారణ ఎన్నికల షెడ్యుల్‌ను ప్రకటించింది. 16వ తేది సాయంత్రం 4 గంటల నుంచి దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవ్వరు పార్టీల కార్యక్రమాలకు, ప్రజాప్రతినిధుల సమావేశాలు, సభలు, సదస్సులకు హాజరుకాకూడదన్నది నిబంధన. కానీ దాన్ని అతిక్రమించి పడమట మండలాల్లో ఓ ఏఎన్ఎం విధి నిర్వహణలో ఉంటూ ఓ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని, నృత్యం చేయడం, తిరుపతి దిశ పోలీసు స్టేషన్‌లో పని చేసే ఓ హెడ్‌కానిస్టేబుల్ బాకరాపేట సమీపంలోని ఓ గ్రామంలో ఓ పార్టీకి కండువ వేసుకుని, ఇంటింటికి వెళ్లి, కరపత్రాలు పంచడం వంటి ఘటనలు బహిర్గతం కావడంతో జిల్లా కలెక్టరు వెనువెంటనే వారిపై విచారణ జరిపి గంటల వ్యవధిలోనే వారిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పదుల సంఖ్యలో వాలంటీర్లను సైతం పార్టీల ప్రచారాల్లో పాల్గొంటున్నారని విధుల నుంచి తొలగించారు. ఇవి బహిర్గతమైనవి మాత్రమే లోలోపల రహస్య ప్రచారాలు చేస్తున్న వారి పరిస్థితి ఏంటి, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల సంఘం పకడ్బంది చర్యలు చేపట్టింది. ఏదిఏమైనా సార్వత్రిక ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగితేనే ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నీటినిల్వలకి సంబంధించి వారం లోగా నివేదిక: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రానున్న నెల రోజులపాటు జిల్లాలో ఎటువంటి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, ఏవైనా ప్రాంతాలలో నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితి ఉంటే వెంటనే పరిశీలించి అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. జిల్లా కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, ఏఈలు ఇతర నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన అధికారులతో రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న వేసవి కాలంను దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వారం లోపల జిల్లాలో ఉన్న నీటి నిల్వల గురించి చెరువులలోను, గ్రామీణ నీటిసరఫరా వ్యవస్థకు సంబంధించిన వనరులలో ఉన్న పరిస్థితి నెలరోజుల వరకు చేపట్టాల్సిన చర్యల గురించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి వనరును తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో జిల్లా పంచాయతీ అధికారిని, జడ్పీ సీఈవో, నీటిపారుదల శాఖ అధికారులతో బోర్లు ఇతర నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన వ్యవస్థలు ఏ విధంగా ఉన్నాయని, జిల్లాలో ఉన్న 4,122 మైనర్ ఇరిగేషన్ చెరువులలో నీటి నిల్వలు ఏ విధంగా ఉన్నాయని ప్రశ్నించారు. ప్రజలకు ఎట్టి పరిస్థితులను నీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చిత్తూరు నుంచి జడ్పీ సీఈఓ గ్లోరియా, డిపిఓ లక్ష్మి, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ రామయ్య, ఇరిగేషన్ ఈఈ నాగభూషణం తపాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

తాగునీటి సమస్యపై సమీక్ష : కమిషనర్

వేసవి నేపథ్యంలో నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో నగరంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటిసరఫరా చేయడానికి అవసరమైన యాక్షన్ ప్లాన్‌సిద్ధం చేయాలన్నారు. లీకేజీలు ఇతర మరమ్మతులపై నివేదిక సమర్పించి, సదరు పనులు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు.

కల్వకుంట జలాశయాన్ని పరిశీలించిన కమిషనర్

నగర శివారులోని కల్వకుంట జలాశయాన్ని కమిషనర్ అరుణ శనివారం పరిశీలించారు. వేసవి దృష్ట్యా జలాశయంలో నీటినిల్వ, ప్రస్తుతం సరఫరా తీరు తదితర అంశాలపై ఇంజనీరింగ్, నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్షించారు. జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం ఎంత ఉంది, ప్రస్తుతం రోజుకు ఎంత నీటిని వినియోగిస్తున్నారు? ఇంకా ఎన్ని రోజులకు సరిపడే నీటి నిల్వలు ఉన్నాయనే అంశాలపై ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. జలాశయంలో ప్రస్తుతం 88 ఎంసీఎఫ్టీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. జలాశయంలోని నీటిని ప్రణాళిక బద్ధంగా వినియోగించుకోవాలని, వేసవిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అనంతరం జలాశయం పంప్ హౌస్‌ను పరిశీలించారు. మోటార్ల రన్నింగ్ టైం, రికార్డులను తనిఖీ చేశారు. మోటార్లు, పంపుసెట్లు పక్కగా పరివేక్షించాలని, అవసరమైన మరమ్మతులను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. నీటిసరఫరాలో లీకేజీ లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నీటిసరఫరా, లీకేజీలను వార్డుస్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. ఎంఈ గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఇరిగేషన్ ఏఈ భాస్కర్ రెడ్డి, నగర పాలక ఏఈలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జలాశయాన్ని పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

కాలువలో మురుగు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగింపు



మురుగునీటిపై మట్టి తోలి చదును చేసిన దృశ్యం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల బజారు వీధి చివరనున్న పాల డెయిరీ సమీపంలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూ ఉండడంతో శనివారం ప్రజాశక్తి దినపత్రికలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు అన్న శీర్షికన వార్త ప్రచురితమైనది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కాలువకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగింప చేసి కాలువలోని చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా కాలువలోనే సజావుగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో రోడ్డుపై మురుగునీరు లేకుండా మురుగునీరు కాలువలోని ప్రవహిస్తోంది. వాహన చోదకులకు పాదచారులకు మురుగునీరు నుండి పరిష్కారం లభించినందుకు ప్రజాశక్తికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మీ 'ఓటు' మా భవిష్యత్తు

విద్యార్థుల వినూత్న ప్రచారం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 'మీ ఓటు మా భవిష్యత్తు' అంటూ విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై వినూత్నంగా ప్రచారం చేశారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వో ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ మార్గనిర్దేశంలో నగరపాలక స్వీప్ నోడల్ టీం వినూత్నంగా కార్యక్రమాలు చేపడుతూ ఓటర్లకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా శనివారం కస్తూరిబా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులచే స్వీప్, ఓట్ అక్షర క్రమంలో ప్రదర్శన నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కు పొందాలని, ఓటు హక్కు కలిగిన వారంతా తప్పకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. నగరపాలక స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య ఆధ్వర్యంలో స్వీప్ బృందం సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న పలమనేరులో 'ప్రజాగళం'



ప్రజాశక్తి- పలమనేరు: ఈనెల 27న పలమనేరులో ప్రజాగళం యాత్ర జరగనుందని మాజీ మంత్రి అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గం ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటగా ప్రజాగళం కార్యక్రమం పలమనేరు నియోజకవర్గంలో జరగనుందని, ఈకార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాగళం కార్యక్రమంలో నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పెద్దపంజాణి మండలం పెద్ద వెలగటూరు పంచాయతీ సంపల్లికి చెందిన పలువురు వైసిపి యువత అమరనాథ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్, కేశవరెడ్డి, అనిల్ కుమార్, జగదీష్, మంజునాథ్ పార్టీలో చేరగా వారికి ఆయన కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు. సీనియర్ నాయకులు ఆర్‌వి.బాలాజీ, రామచంద్ర నాయుడు, బ్రహ్మయ్య, ఆర్‌బిసి కుట్టి, నాగరాజు రెడ్డి, కిషోర్ గౌడ్, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు ఇంటింటికీ టిడిపి ప్రచారం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని గంటావారిపల్లి పంచాయతీలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రంలో భాగంగా ఇంటింటికీ టిడిపి ప్రచారం నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ మీడియా కోఆర్డినేటర్ గురుసాల కిషన్ చంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ పాల్గొంటారని కనుక టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోబోటిక్ ద్వారా శస్త్రచికిత్స

మణిపాల్ ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ దినేష్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రోబోటిక్ పద్ధతిలో మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స ద్వారా చేస్తామని బెంగళూరు మణిపాల్ హాస్పిటల్ ప్రముఖ వైద్యనిపుణులు దినేష్ మన్ని తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలానికి చెందిన తాను బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో వైద్యనిపుణులుగా పని చేస్తున్నానని తెలిపారు. గత ఏడాది కాలంగా ప్రతినెలా రెండు రోజులపాటు చిత్తూరు కొండారెడ్డిపల్లిలో ఉన్న శ్రేష్ట ఆసుపత్రిలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొదటి, మూడవ బుధవారం రోబోటిక్ పద్ధతిలో మోకాళ్ళ మార్పిడి చేస్తామన్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా అధునాతనమైన పద్ధతిలో ఈ శాస్త్ర చికిత్సను అందిస్తామన్నారు. తన సొంత ప్రజలకు కూడా మెరుగైన వైద్యం అందించాలని తక్కువ ఖర్చుతో శస్త్ర చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని చిత్తూరు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దినేష్

ఎన్నికల నియమావళిని అనుసరించాలి

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఎరువుల దుకాణ యజమానులు (డీలర్లు) ఎన్నికల నియమావళిని అనుసరించి అమ్మకాలను సాగించాలని పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన సోమల రైతు భరోసా కేంద్రం-1లో మండలంలోని 15 మంది ఎరువుల దుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా రాజకీయ నాయకుల ఫోటోలు, పార్టీ గుర్తులు, పేర్లు, పోస్టర్లు ఎరువుల దుకాణం వద్ద ఉండరాదని, ప్రధాని మోడీ బొమ్మతో ఉన్న ఎరువులు అమ్మాల్సి వచ్చినప్పుడు ఫోటో కనిపించకుండా రంగుపూసి ఎరువులు అమ్మాలని, నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అధిగమించి ప్రవర్తిస్తే దుకాణ లైసెన్స్ రద్దు చేయడం ఎన్నికల నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సింది వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, ఎరువుల దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి: ఎంపిడిఓ

బంగారుపాళ్యం: గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు చేయాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. శనివారం మండలంలోని జంబువారిపల్లి, గుంటూరు, బోడబండ్ల, తగువారిపల్లి సచివాలయాలలో తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను గ్రామాల్లో అమలు చేయాలని, రాజకీయ నాయకుల ఫోటోలు పార్టీ జెండాలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక సచివాలయ కార్యదర్శులు వీఆర్వోలపై ఉందన్నారు. ఎన్నికల అధికారి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి మధు దుర్గాప్రసాద్, కానిస్టేబుల్ బెనర్జీ పాల్గొన్నారు.

'కోడ్'కూసినా... రంగులు మారవే..

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

ఎన్నికల కోడ్ అమలు చేసి వారం రోజులు అవుతున్న అధికారులు ఇంకా నిబంధనలు అమలు చేయడం లేదు. బుక్కాపట్నం పంచాయతీ రెడ్డేపల్లెలోని రైతుభరోసా కేంద్రం, అలాగే తూగుండ్రం పంచాయతీ తూగుండ్రం, కండ్రిగ దళితవాడలో గల నీళ్ల ట్యాంకు వైఎస్సార్‌సీపీ జెండా రంగులతో కళకళలాడుతున్నా.. అధికారులు స్పందించడం లేదు.. దీనిపై ఎన్నికల నియమావళి కఠినంగా అమలు చేయాలని ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.





'శ్రామిక' పక్షపాతి సురేంద్రరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటి



తిరుపతి రైల్వే క్యారేజీ రిపేర్ షాప్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల సాధన కోసం మూడు దశాబ్దాలుగా నిరంతరం పోరాటాలు సాగిస్తున్న అలుపెరగని శ్రామికుడు, కార్మిక నాయకుడు, దక్షిణ భారతదేశంలోనే రైల్వే మజ్దూర్ యూనియన్‌లో తనకంటూ ఒక ప్రత్యేక నాయకత్వాన్ని చాటుకున్న వ్యక్తి మోడీగుంట సురేంద్ర రెడ్డి. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పింఛన్ విధానాన్ని రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని అమలులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సిహెచ్ శంకర్రావు నాయకత్వాన్ని స్ఫూర్తిగా ఎంచుకుని సిఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ తరపున అనేక పోరాటాలు నడిపించానని తెలిపారు. నూతన పింఛను విధానం వల్ల కార్మిక సోదరులకు భవిష్యత్తులో వచ్చే నష్టాన్ని కళ్ళకు కట్టినట్టు ఎగ్జిబిషన్ ద్వారా వివరించానన్నారు. తిరుపతి రైల్వే క్యారేజ్ రిపేర్ షాప్‌లో ఉద్యోగులు కార్మికుల పక్షాన 38 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో సమ్మెలు, ధర్నాలు, గేట్ మీటింగ్లు నిర్వహించి ఓటమి ఎరుగని నాయకుడుగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిల పరచుకొని, అందరి మన్ననలను పొందడం ఆనందంగా ఉందన్నారు.

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం వెంకటాపురంలో మోడీగుంట దొరస్వామి రెడ్డి, నారాయణమ్మలకు ఐదో సంతానంగా సురేంద్ర రెడ్డి మే 10, 1964లో జన్మించారు. ప్రాథమిక విద్య పోలవరంలో, పదో తరగతి వరకూ పూతలపట్టులో, ఇంటర్ పాకాలలో, డిగ్రీ చిత్తూరు పివికెఎన్‌లో పూర్తి చేశారు. అన్నామలై యూనివర్సిటీలో బిఇడి చేసిన ఆయన సాంకేతిక విద్యవైపు దృష్టి సారించారు. తిరుపతిలో ఐటిఐ చేసి సెంటర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో అధ్యాపక వత్తిని నిర్వహించారు. 1987లో తిరుపతి రైల్వే క్యారేజీ రిపేర్ షాప్‌లో రైల్వే ఉద్యోగంలో చేరారు. 1991 సంవత్సరంలో తిరుపతికి చెందిన మంజులతో వివాహమైంది. వారికి హిమబిందు, సింధు ఇద్దరు కుమార్తెలు. ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్‌లో 2019నుంచి 2024 వరకు జోనల్ సెక్రటరీగా , వర్క్ షాప్స్ డివిజనల్ సెక్రెటరీగా తన 38 ఏళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. ప్రతి ఏటా స్పోర్ట్స్‌మీట్ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



సతీ సమేతంగా..

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంగవరం

మండలంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. సిఐ టి.చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు పెద్దపంజాణి మండలం తిప్పిరెడ్డిపల్లి, శాంతినగర్‌కు చెందిన మృతుడు యానాది సామయ్య (50) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్యలేదు, అక్క జ్యోతమ్మ వద్ద ఉంటున్నాడు. రోజులాగే శనివారం యాత్రమండ చెరువుకాలనీకి చెందిన నాగరాజు, బొనమంద గ్రామానికి చెందిన లక్ష్మయ్యలతో కలిసి పలమనేరులో కూలి పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. కళ్లుపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా శాంతిపురం మండలం శివరామపురం గ్రామానికి చెందిన రాకేష్, కిరణ్, కిషన్‌రెడ్డి విజయవాడ నుంచి మదనపల్లి వైపు అతి వేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. దీంతో బైక్‌పై వస్తున్న లక్ష్మయ్య, నాగరాజుకు తీవ్రగాయాలు కాగా సామయ్య అక్కడిక్కడే మరణించారు. స్థానికులు గాయపడిన వారిని, సామయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారు.



మృతుడు సామయ్య

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి - వెదురుకుప్పం/ ఎస్ఆర్ పురం: మండలంలోని ఇండో జర్మన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన అదుపు తప్పి చెట్టును ఢీకొని విద్యార్థులకు గాయాలు సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని నెలవాయి గ్రామంలోని ఇండో జర్మన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులను స్కూల్ నుండి ఇంటికి స్కూల్ బస్సు వెళుతుండగా ఎగువ ముద్దికుప్పం వద్ద ద్విచక్ర వాహనం బస్సుకి ఎదురుగా రావడంతో తప్పించబోయి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ఎల్‌కేజీ విద్యార్థి ఉదయ్, 9వ తరగతి విద్యార్థిని కుమారికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని ఎస్ఆర్ పురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు భయాందోళన గురై బస్సులో గాయపడిన వారిని సొంత వాహనాల్లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.



సాయుధ బలగాల కవాతు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఎస్పీ పి.జాషువ ఆదేశాల మేరకు చిత్తూరు డి.ఎస్పీ రాజ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు 1వ, 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇన్స్పెక్టర్లు విశ్వనాథ రెడ్డి, ఉలసయ్య కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని ఆయా పరిధిలోని ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ముఖ్యమైన కాలనీలలో ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ప్రజలకు ఎలక్షన్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు.

శాంతిపురం: మండల పరిధిలోని రాళ్ళబూదుగూరులో కుప్పం నియోజకవర్గ రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి నేతృత్వంలో శనివారం భారామతి ఫ్యాక్టరీ క్రాస్ నుండి రాళ్ళబూదుగూరు గ్రామంలోని ప్రధాన వీధులలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని కేంద్ర ఆర్మీ బలగాలతో కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వి.సుమన్ మాట్లాడుతూ ఎన్నికల జరగనున్న సందర్భంగా ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ఆర్మీ బలగాలతో ర్యాలీని నిర్వహించామన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని మొద్దుల వంక గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కృష్ణప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలను వైసీపీ నేతలు అందజేశారు. చంద్రమోహన్ రెడ్డి, గంగయ్య, దేవరాజు రెడ్డి, జయచంద్ర రెడ్డి, గోపి, శివ, రఘు, కిషోర్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ముగ్గురు వలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి- సదుం: మండల పరిధిలో ఈనెల 19వ తేదీన పాలమంద, ఊటుపల్లి, చింతలవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన పాల్గొని వలంటీర్లు ఈశ్వరయ్య, గురుప్రసాద్, బాలాజీలు ఎన్నికల నిబంధనలు ఉల్లఘించినందున వారిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎంపిడిఓ రాజశేఖర్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

గురుకుల పాఠశాల ప్రవేశానికి 31 ఆఖరి తేదీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండలంలోని కమ్మనపల్లి గురుకుల పాఠశాల ప్రవేశానికి ఈనెల 31వ చివరి తేదీ అని నమోదు చేసుకోదలచివారు ఆన్‌లైన్‌లో 31లోపు నమోదు చేసుకోవాలని కమ్మనపల్లి ఏపిఆర్ గర్ల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈఆర్.శోభ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,8 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీకి సంబంధించి ప్రేవశానికి https://aprs.apcfss.in ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీన జిల్లా ప్రధాన కార్యాలయంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

'క్షయ' నివారణపై అవగాహన ర్యాలీ



ప్రజాశక్తి- గంగవరం: జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా పత్తికొండ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి ఉన్న వారు డాక్టర్ సలహా మేరకు మందులు వాడితే వ్యాధి నివారణకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే క్షయ అనే అనుమానం ఉన్న వారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లను సంప్రదించాలని కోరారు. ర్యాలీలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- రామకుప్పం: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 25, 26న కుప్పం నియోజకవర్గ పర్యటనను టిడిపి నేతలు పెద్దసంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. విశ్వనాథ్, రఫీ, గంట్లప్ప గౌడు, మునిరెడ్డి, కృష్ణా నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, పరశురాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని బగళనత్తం గ్రామంలో శనివారం సూపర్ సిక్స్ పథకాలను టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించారు. పంచాయతీ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, ముని రెడ్డి, రాఘవేంద్ర నాయుడు, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎంపీ పర్యటన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లి జిల్లా కోశాధికారి ధనుంజయ రెడ్డిని చిత్తూరు ఎంపీ రెడ్డి రెడ్డప్ప శనివారం పరామర్శించారు. మండలంలో పర్యటించి పార్టీ స్థితిగతులపై ఆరా తీశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రాజు, సర్పంచ్ హరోహర రెడ్డి, ఉపసర్పంచ్ దొరస్వామి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- సోమల: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 నెలల వయసు వచ్చేవరకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయించాలని ఏఎన్ఎం ప్రమీల అన్నారు. శనివారం ఎస్.నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఆశా కార్యకర్త జ్యోతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి- శాంతిపురం

మండల కేంద్రంలోని వినాయక ప్రైవేట్ ఐటిఐ కళాశాలలో అమ్మా చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో కంప్యూటర్, టైలరింగ్ ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌జి.హేమ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులకు, 18 నుండి 42 సంవత్సరాల వరకు అప్లై చేసుకోవచ్చు అన్నారు. పై కోర్సులపై ఆసక్తి ఉన్న వారు మీ సర్టిఫికెట్స్ ఆధార్ కార్డ్, ఎస్ఎస్‌సి, ఇంటర్ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈనెల 26 లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 93927 04143ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా శని త్రయోదశి

ప్రజాశక్తి - రామకుప్పం: మండల శివార్లలోని శనీశ్వరాలయంలో శని త్రయోదశి పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి తైలాభిషేకం, పంచామృత అభిషేకం, వివిధ పుష్పాలతో సుందరంగా ఆలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అలాగే పక్కనే ఉన్న శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు వీరికి తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం చేశారు.

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి- సోమల: మండలం ఆవులపల్లె గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు టిటిడి ఆధ్వర్యంలో జరిగాయి. శనివారం స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా రథంపై గ్రామంలో ఊరేగారు. ఉదయం ఆలయంలోని మూల విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు అభిషేకాలు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కలు తీర్చుకున్నారు.

స్వర్ణకాంతులు చిందే రథంపై కామాక్షిసమేతంగా కరంతేశ్వరుడు దేధీప్యమానంగా మాడవీధుల్లో విహరించాడు. నగరి పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కళ్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజైన శనివారం రథోత్సవ వేడుకలు నిర్వహించారు. భక్తులు రథాన్ని లాగుతూ కరకంతేశ్వరునికి కర్పూరహారతులిచ్చి దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో భారీ అన్నదానం నిర్వహించారు. రథం విరాళదాతలు కోనేరు అమృతమ్మ, సుబ్రమణ్య మొదలియార్, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఫిజికల్ సైన్స్ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి

పదో తరగతి పరీక్షల్లో ఐదో రోజైన శనివారం ఫిజికల్ సైన్స్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. తిరుపతి జిల్లాలో పరీక్షకు మొత్తం 27,388 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 26,826 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 562 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ పేర్కొన్నారు. 97.94 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రకటించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసి, పర్యవేక్షించినట్లు తెలిపారు.

ఈవోగారు... సపరేటా...!

టిటిడికి వర్తించని ఎన్నికల నిబంధనలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: 'టిటిడి ఇన్‌ఛార్జి ఈవో ఎవి ధర్మారెడ్డి డిప్యూటేషన్ గడువు మే 14తో ముగియనుంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆ సమయంలో వేరే వారిని భర్తీ చేయడం తగదు.. ఈ నేపథ్యంలో ముందుగానే టిటిడిలో రెగ్యులర్ ఈవోను నియమించి ఉండొచ్చని' రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. టిటిడిలో రెగ్యులర్ ఈవోగా పనిచేసేందుకు నిజాయితీ, అర్హత కలిగిన ఐఎఎస్ అధికారులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈవో ఎవి ధర్మారెడ్డి డిప్యూటేషన్ కాలపరిమితి సూపర్‌ఏన్యుయేషన్ జూన్ 30 వరకూ ఇవ్వాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాయడంలో ఆంతర్యం ఏంటని మండిపడ్డారు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వేసవి సెలవులతో పాటు అన్ని పరీక్షలు పూర్తయినందున తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దాదాపు 30 గంటల పాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో దర్శనం కోసం వేచి ఉంటారని, ఈ కారణంగా ధర్మారెడ్డి లాంటి అనుభవం కలిగిన అధికారి డిప్యుటేషన్ పిరియడ్ మే 14తో ముగియనుందని, మరో ఆరు వారాలు గడువు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంలో మర్మమేమిటో భక్తులకు సమాధానం చెప్పాలన్నారు. ఏళ్ల తరబడి ఇతర ఐఎఎస్‌లకు అవకాశం ఇవ్వకుండా ఎవి ధర్మారెడ్డినే కొనసాగించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. శ్రీవారికి సంబంధించిన బ్యాంకు డిపాజిట్లు, ఆర్థిక లావాదేవీలు సక్రమంగా జరుగుతున్నాయా? అనే అనుమానాలు కలుగుతున్నాయని, రెగ్యులర్ ఐఎఎస్‌ను నియమించి శ్రీవారి భక్తుల్లో అపోహను తొలగించాలన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఇతర రెవెన్యూ ప్రభుత్వాధికారులను ఎన్నికల కోడ్ కారణంగా బదిలీ చేశారని, ఈవోకు మినహాయింపు ఏంటని ప్రశ్నించారు.

పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారును టిప్పర్ ఢీకొంది. తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరు కావడానికి విజయవాడ వెళ్తున్న పులివర్తి నాని కారును గుంటూరు వద్ద టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో పులివర్తి నాని తో పాటు కారులో ఉన్న అందరూ సురక్షితంగా బయటపడ్డారు. కార్యకర్తలు, నాయకులు ఎవ్వరూ అధైర్యపడవద్దని క్షేమంగా ఉన్నానని ఆయన చెప్పారు.

పవన్ భరోసాతో సర్దుకున్న కోట వినుత

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు మంగళగిరి కేంద్ర కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోటా దంపతులు కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే సీటు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపవన్ కల్యాణ్ ఎంఎల్ఎ కంటే బలమైన ప్రాతినిధ్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో ఆమె కృతజ్ఞతలు తెలిపారు. టిడిపితో కలిసి పనిచేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. రాష్ట్రం కోసం, పవన్ కోసం ఏ త్యాగానికైనా సిద్ధమని తెలిపారు. మార్పు సాధించడానికి రాష్ట్రవ్యాప్తంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరురపతి సిటి ముంబాయికి చెందిన కమల్ ఝుంఝున్వాలా, బాల సుదర్శన్ రెడ్డి శనివారం బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం ఇచ్చారు. తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో శనివారం ఉదయం దాతలు ఈ విరాళం చెక్కును బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడప్పరెడ్డికి అందచేశారు.